# ఒక ప్రేమ కథ

- కొండా విజయ మోహన్



"ఈ వర్షాకాలం వయసు నాలుగేళ్ళు"

"అంటే..."

"మన పరిచయం...ప్రేమ గీతాలాపన... నాలుగేళ్ళ నుంచి కొనసాగుతున్నాయన్నమాట... "

ఆమె మాటలను మధ్యలోనే అడ్డుకుంటూ "అర్చనా- ఆగాగు ... తరువాత నువ్వు చెప్పేదేంటో నాకు తెలుసు" అన్నాడతను.

"నో ... ప్రవీణ్.. ఈ సారి మటుకు ... ఐయామ్ వెరీ సీరియస్ అబౌటిట్...చెప్పు...మన పెళ్ళెప్పుడు?" అతని చేతిని తడుతూ ...పంటికింద నవ్వునూ ... కనుల వెనుక సిగ్గునూ దాచిపెట్టుకుంటూ ప్రశ్నించిందామె.

చేరువలోని చెట్టు కొమ్మల్లోంచి జారిపడుతున్న వాన చినుకుల్ని అరచేతిలో పట్టుకుంటూ మౌనంగా వుండిపోయాడతను.

అప్పుడే కురిసి ఆగినట్టుంది వర్షం...మట్టి వింత సువాసనల్ని వెదజల్లుతోంది.

"మౌనం అర్ధాంగీకారమంటారు..." మెల్లగా అందామె.

"ఈ టైపు మౌనానికి కాదులే "...అరచేతుల్లోని తడిని తుడుచుకుంటూ ఆమె వైపు తిరిగి అన్నాడతను.

"ఏంటో వింత జీవివి. నువ్వు ప్రొఫోజ్ చేస్తే నేను బెట్టు చేయాల్సింది. అలాంటిది మన విషయంలో రివర్స్ కేసయిపోయింది " పెదవి విరుస్తున్నట్టుగా మూతి కదిపి అందామె.

"అర్చనా.. ప్లీజ్ ట్రై టు అండర్‌స్టాండ్ మీ... లెట్ మీ సెటిల్ డౌన్ ఫస్ట్...నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా?!"

"బాబ్బాబూ ప్రవీణూ...నువ్వంటే నాకు ప్రాణం... అందుకే ఈ తొందర...ట్రైటు అండర్‌స్టాండ్ యూర్" ముందుకు పడుతున్న ముంగురుల్ని వెనక్కితోసుకుంటూ అంది.

"ఓ వసి మనను పావ... హరిహరాదులు అడ్డువడ్డా...అటువారు... ఇటువారు గోడకి తలలుకొట్టుకున్నా... మన పెళ్ళి జరిగి తీరుతుంది. పాత సినిమా డైలాగే అనుకో- చెప్పక తప్పలేదు మరి" అంటూ ఆమె అరచేతిని చిన్నగా నొక్కాడతను.

"నేను పసిపాపనే గానీ.. తమరివి ముదురు చేష్టలు కదా..." అంటూ అతని చేతినుంచి తన అరచేతిని సున్నితంగా తప్పించి ..."సరైన కారణాలు వుంటే ... పోనీ నువ్వు చెబితే నేను తొందర పెట్టేదాన్ని కాను...కానీ నువ్వు చెప్పే కారణాలేవీ- మనం మరింత కాలం ఇలాగే వుండిపోయేంత సీరియస్‌వి కావు. ఆలోచించు ప్రవీణూ... "

"జీవితం గురించి మరీ అంత లైట్‌గా ఆలోచిస్తావేంటి అర్చనా?! కాస్త సీరియస్‌గా ఆలోచించు. మనం పెళ్ళి చేసుకోవడం ఏమంత పెద్ద విషయం కాదు. తర్వాత జీవితం గురించే నా ఆలోచన. ఇప్పుడు నేను చేస్తున్న ఉద్యోగాన్ని నమ్ముకుని పెళ్ళి చేసుకోమంటావా? ఈ ప్రైవేటు ఉద్యోగం...చాలీ చాలని జీతంతో మనం సుఖంగా జీవించగలమంటావా? ..." అతని మాటలు పూర్తి కాకుండానే ఆమె అడ్డుపడింది.

"...పెళ్లి తర్వాత జీవితం గురించి అంతగా బెంబేలు పడిపోవాల్సిన అవసరం లేదు. పెళ్లి కాకముందే ఇంతగా ఆలోచించి...ఆలోచించి జుట్టు రాలిపోయేలా చేసుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు...మైడియర్ వుడ్ బీ..." అతని కేసి కొంటెగా చూస్తూ అందామె.

"నువ్వెంతలా చెప్పినా అంతలా ఆలోచించాల్సిన అవసరం వుందమ్మాయ్...పెళ్లి చేసుకున్న తర్వాత నా అర్చనకు ఏదీ తక్కువ కాకూడదు. ముందు చూపు లేకుండా పెళ్లిళ్ళు చేసేసుకుని...ఆ తర్వాత వచ్చిపడే సమస్యలకు అతలాకుతలమైపోతూ తల్లడిల్లిపోయే బాపతు మనుషులంటే నాకు పరమ చిరాకు. మరీ ముఖ్యంగా ప్రేమికులజీవితాలు అలా అయితే అది మరీ విషాదం. ఎంతో అపురూపంగా ఒకరినొకరు చూసుకుంటూ కాలం గడిపిన రోజులు మాయమై ... ఒకరిపొడ ఒకరికి గిట్టని రీతిలో రోజులు నెట్టడం ఎంత బాధాకరమో ఎప్పుడైనా ఆలోచించావా...అలాంటి పరిస్థితులు మనకు ఎప్పుడూ రాకూడదు. అందుకే నేను పెళ్ళి విషయంలో అంతగా ఆలోచిస్తుంటాను..." ఇంకా అతను మాట్లాడాలని ప్రయత్నిస్తుండగానే -

"మహా ప్రభో! ఈ వ్యక్తిత్వ వికాసం తాలూకు పుస్తకాల భాష ఆపు. నువ్వు చెప్పింది నిజమే. కానీ పూర్తిగా మటుకు కాదు. అందరూ నీ ప్రకారంగానే ఆలోచిస్తే మగాళ్లలో సగం మందికి పైగా పెళ్లిళ్లు అయ్యేవికావు. అసలు జీవితంలో స్థిరపడడం అనే దానికి సరైన నిర్వచనం వుందా?" ఆమె చాలా సీరియస్‌గానే అడిగింది.

"నా మటుకు నాకు స్థిరపడడం అంటే ...ఆర్థికంగా నిలదొక్కుకోవడం. ప్రతి చిన్న అవసరానికి తడుముకోకుండా వుండడం"

"భేష్...బాబు! అంతా బాగుంది. మరి నువ్వనుకున్నది సాధించిన తర్వాత ఇక సమస్యలంటూ వుండవా? జీవితమంతా సాఫీగా సాగిపోవడమేనా?"

"కొంతవరకు అంతే మరి. మనం సరిగ్గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలిగితే ఇక సమస్యలు ఎందుకు వస్తాయి. జీవితం మనం చెప్పినట్టు నడవాలే కానీ మనం జీవితం చేతిలో పావుగా మారకూడదు" అతను గొంతులో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పలికించాననుకున్నాడు.

అతని మాటలు విన్న ఆమె మాత్రం నవ్వింది. పసిపిల్లాడిని చూసి నవ్వినట్టుగా...

ఆకాశంలో మేఘాలు మెల్లమెల్లగా గుమిగూడాయి. చినుకులు తుంపరగా రాలిపడుతున్నాయి.

తల మీద నాలుగు చినుకులు రాలగానే ప్రవీణ్ కంగారు పడ్డాడు.

"అదేంటి మాస్టారూ... గొడుగు తెచ్చుకోవడం మరిచిపోయారా! మీ దూరదృష్టి ఏమయిందిక్కడ" అతన్ని ఉడికిస్తూ అంది అర్చన.

"డోన్ట్ బి సిల్లీ ... దేనిదేనికో పోలుస్తావు. ఈ మధ్యన నన్ను ఏడిపించడం ఎక్కువవుతోంది " జుట్టు మీద పడ్డ చినుకులను చేతుల్తో తుడుచుకుంటూ ప్రవీణ్ ఆమెకేసి చూశాడు.

"ఇందులో సిల్లీ ఏముంది?! ముందు చూపుతో ఆలోచించగలిగితే ఏ సమస్యలూ రావని నువ్వే కదా అన్నావ్!"

"నేనన్నది జీవితానికి సంబంధించిన విషయాల గురించి."

"జీవితంలో మటుకు ఊహించని సంఘటనలు జరగవంటారా తమరు?!"

"అలాని కాదు గాని ముందు చూపు వుండడం చాలా మంచిదని మటుకు అంటాను."

"ముందు చూపు పేరుతో పుణ్యకాలం కాస్తా హరాయించేసి తర్వాత తీరిగ్గా చింతిస్తూ కూర్చోవడం మీలాంటి ఆలోచనా పరులకు షరా మామూలే."

"అర్చనా! ఇంతకూ నువ్వు చెప్పదల్చుకున్నదేమిటో

కాస్త అర్థం అయ్యేట్టు చెప్పు" ఉక్రోషంతో అతని మొహం ఎర్రబడింది.

"ఇందులో మొహం ఎర్రబడేందుకు ఏమీ లేదుగా నీ...మొదట 'జీవితంలో స్థిరపడడం' అన్నదానికి నువ్ చెప్పిన కారణాలేవీ నాకు నచ్చలేదు."

"పోనీ నువ్ చెప్పరాదు...వింటాను."

"అయితే విను. నా మటుకు నాకు స్థిరపడడం అన్న విషయం గురించి విశ్వజనీనమైన నిర్వచనమేమీ లేదనిపిస్తుంది. జీవితం చాలా పెద్దది. ఊహించగలం... ముందే చెప్పగలం...అన్న మాటల్లో ఫూలిష్‌నెసే కనిపిస్తుంది. మా తాతయ్య పెళ్లి చేసుకున్నప్పుడు ఆయనకేమీ లేదు. ఆ పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవడాన్ని ఈ తరానికి చెందిన మీలాంటి వాళ్లకు ఊహకుకూడా అందదు. ఆయనకు అమ్మా, నాన్న ఇద్దరూ లేరు. పాలేరుగా ఉండేవాడు.వాళ్ల కామందు కూతురు పెళ్లయిన ఏడాదికే విధవగా మారి ఇంటికి వచ్చింది.మామూలుగా అయితే, ఆమె జీవితం అలాగే తెల్లారి పోయేదేమో. అటువైపు పెద్దలందరినీ ఎదిరించి ఆయన ఒక రోజు నానమ్మను పెళ్లి చేసుకుని నగరానికి వచ్చేశాడు. కట్టుబట్టల్తో వచ్చిన ఆ జంట పదికాలాలపాటు పచ్చగానే కాపురం చేసింది. తాతయ్య ఎప్పుడూ అంటాడు.' పెళ్లికి సుముహూర్తాలు అంటూ వుంటే అది ధైర్యంగా మనసుకు నచ్చిన మనిషి చెయ్యి పట్టుకున్న క్షణాలేనని'-అది ఆ కాలం కథ. చదువురాని ఒక మనిషి పెద్ద మనసుతో చేసిన సాహసం.కాలం మారింది. అభ్యుదయ వాదులు అనుకునే ఈతరం వాళ్లు ఎంతమంది ఆ సాహసం చేయగలరు?! ఇంకా చెప్పాలంటే ఆ కాలంకన్నా ఈకాలంలోనే సంకుచితధోరణులు బాగా పెరిగిపోయాయి. అయితే అవి పైకి కనిపించకుండా ముందుచూపు,జీవితంపై అవగాహన అన్న పెద్ద పెద్ద మాటల ముసుగులు వేసేస్తున్నారు." చాలాసేపు మాట్లాడానేమో అనిపించిందామెకు.వాతావరణం తేలిక పరుస్తూ " బాగా సుత్తి కొట్టినట్టున్నాను కదా!" అంది అతనికేసి చూస్తూ.



"అయితే విను.
నా మటుకు నాకు స్థిరపడడం అన్న విషయం
గురించి విశ్వజనీనమైన
నిర్వచనమేమీ లేదనిపిస్తుంది.
జీవితం చాలా పెద్దది.
ఊహించగలం...ముందే
చెప్పగలం...
అన్న మాటల్లో ఫూలిష్‌నెసే
కనిపిస్తుంది. మా
తాతయ్య పెళ్లి
చేసుకున్నప్పుడు
ఆయనకేమీ లేదు.

అతను మౌనంగా ఆమెకేసి చూస్తుండిపోయాడు.ఆమె ఎప్పుడూ అంతే. పూర్తిగా అర్థం అయిపోయిందనిపిస్తుంది. కాని మరుక్షణమే ఎంతకూ అర్థంకాని లోతైన మనిషి అని కూడా అనిపిస్తుందతనికి.

నాలుగేళ్ల ప్రేమ జీవితంలో అతనికామె ఎప్పుడూ సరదా అమ్మాయిగానే కనిపించడానికే ప్రయత్నించేది.కాని పంజాబీ డ్రెస్ వేసుకున్నా పట్టుచీర హుందాతనం నడకలోను,నడతలోను పోగొట్టుకునేది కాదు. జీన్స్ ప్యాంట్, టీషర్టులతో చలాకీ షోకిల్లాలా అనిపించినా గొబ్బెమ్మలమీద గుమ్మడిపూలు పెట్టేసి చిన్న పిల్లలా కేరింతలు కొట్టేది.ఆమె కొలను గట్టున పట్టు పావడాను పైకి దోపుకుని గన్నేరు పూలు ఏరుకునే ఎంకిలాను అనిపిస్తుందోసారి. గుంభనంగా వుంటూనే తన ఆత్మ గౌరవానికి ఏమాత్రం తక్కువ గాకుండా చూసుకునే ఆధునిక అమ్మాయిలానూ వుంటుంది మరోసారి. ఇదంతా అతను గమనించిన ఆమె వ్యక్తిత్వం.

ఆ వ్యక్తిత్వమే అతణ్ణి అయస్కాంతంలా ఆకర్షించింది. ఆవ్యక్తిత్వం పట్ల ప్రేమే ఇప్పుడామె మాటలు శ్రద్ధగా వినేలా చేస్తూంది.

అతను మౌనంగా తననలా చూస్తుండి పోవడం గమనించిందామె.

" ఏ ఆలోచనలు ముప్పిరిగొని...ఇలా మౌనస్వామిలా మారారు...మహానుభావా!" అంటూ నవ్వింది.

" ఏ ఆలోచనలు కాదు కానీ ...మన పెళ్లికి సంబంధించిన నిర్ణయం నువ్వే తీసుకోవాలి. నువ్వెలా చెబితే... అలా వింటాను. నాకెందుకో నీమాటలు వింటుంటే లేనిపోని ఆలోచనలతో ...పైకి కనిపించని భయాలతో వున్నాననిపిస్తోంది." అన్నాడతను.

ఆ క్షణంలో అతనిలో ఏదో అలజడి. నాలుగేళ్లపాటు...ఆమె ఏనాడూ పెళ్లికి తొందర చెయ్యలేదు. ఇద్దరూ కలిసి 'ప్రేమ' కాలాన్ని చక్కగా ఎంజాయ్ చేశారు...ఎక్కడా హద్దులు దాటకుండా. తను జీవితంలో బాగా స్థిరపడ్డ తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అర్చనలాంటి అమ్మాయికి ఏ బాధలు తెలియకుండా చూసుకోవాలనుకున్నాడు. ఎలాంటి బాధలు...అన్నది తనకు స్పష్టంగా తెలీదనిపించింది.

ఆ అమ్మాయి తాతకథ వినగానే అతనికి ఏవో విశ్వాసపు ఊపిరులు పీల్చినట్టయింది.తన ఆలోచనలు తనకే చైల్డిష్‌గా అనిపించాయి. ఆమెనే ఒకసారి మాటల్లో అతనితో అంది " ప్రవీణ్...నువ్వేమన్నా అనుకోగానీ, నీ ఆలోచన నాకు నచ్చలేదు. నువ్వేదో బాగా కష్టపడి...నాకెలాంటి ఇబ్బంది లేకుండా...దేవతలా చూసుకోవాలంటావ్. ఎంత నాన్సెన్సో కదా?! పెళ్లంటే ఏఒక్కరికీ గుదిబండ కాదు. ఏ ఒక్కరిదీ కొవ్వొత్తి పాత్ర కాదు. బాధ్యతల్లో చెరినగం...భయాల్లో ఒకరికొకరు అండగా ...సుఖదుఃఖాల్లో తోడునీడగా వుండే సాహచర్యమే పెళ్ళి! వివాహం...ఆ తర్వాత జీవితానికి కావాల్సింది నిలకడైన జీతం...వెనకదన్నుగా ఆస్తిపాస్తులు కాదు. నిలకడైన మనుషులు...ప్రేమ యింకని మనసులు"- ఆ మాటల గురించి ఇప్పుడాలోచిస్తుంటే కొత్తకొత్త అర్థాలు తెలుస్తున్నాయి.

ఆకాశంలో మేఘాలు తేలికపడ్డాయి. పల్చటి మేఘాల తెరలనుంచి పసిడిరంగులో సూర్యకాంతి మెరుస్తోంది. వర్షం ఆగిన తర్వాత కాచే ఎండ తాలూకు అందానికి ముగ్ధుడవుతూ-ఆమె చేతిని మెల్లగా స్పృశిస్తూ...

" అర్చనా, పెళ్లి చేసుకోవాలని ఎందుకు తొందర పెడుతున్నావో తెలుసుకోవచ్చా?" అని అడిగాడతను. అప్పటికే అతను మనసులో ఒక స్థిర నిర్ణయానికి వచ్చేశాడు.

అతని చేతిపై తను చేయివేస్తూ...మృదువుగా నొక్కిందామె. మెల్లగా అంది-" ఎక్కడో చదివిన గుర్తు 'నిర్భాగ్యులమైన నరాల జబ్బు మనుషులం. మేము జీవిత మధువులని వున్నవివున్నట్టుగా గ్రహించలేం...' అని. మనం అలా కాకూడదనే ఈ తొందర " అందామె.

" నిజమే సుమీ...కాలహరణ దోషం మనప్రేమకు పట్టకూడదు"అన్నాడతను ఉత్సాహంగా.

" అంతేకాదు ప్రవీణ్... తాతయ్య తొందరపెడుతున్నాడు. అమ్మాయి తొందరగా పెళ్లి చేసుకో, చూసిపోతాను ..ఏంటో పెద్ద చదువులు చదివితే పెళ్లి వూసు ఎత్తకూడదని ఎక్కడైనా ఉందా?... మనవరాలా ఈతాతయ్య కోరిక తీర్చేస్తే ... ప్రశాంతంగా వెళ్ళిపోతాను కదా!! అని ఒకటే గోల చేస్తున్నాడు... అన్నట్టు ఇంకో న్యూస్ - నాకు బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది... ఇలా గ్రహాలన్నీ అనుకూలించేసి పెళ్లికి తొందరపడమంటున్నాయి. హీరోగారు కాస్తా జీరో ఫేసు మార్చేస్తే చాలు..." అంటూ అతని కళ్లల్లోకి చూస్తూండిపోయిందామె.

" అలా చూడకు... సిగ్గేస్తుంది..." అన్నాడతను ఆమెకేసి కొంటెగా చూస్తూ...

" సిగ్గు తర్వాత పడొచ్చు కానీ... ఏమాలోచించావో చెబుతావా" అందామె

" పాపం... ముసలాయన కదా... మీ తాతయ్య కోరిక త్వరగా తీర్చేద్దామని నిర్ణయించుకున్నాను"

అమె అతని చేతిని గట్టిగా గిల్లింది.

కెవ్వు మంటూ " కాపురం అప్పుడే మొదలెట్టేశావే" అన్నాడతను.

**ఆ నీరెండలు -ఆకాశంలో ఓ ఇంద్ర ధనుస్సు రమ్యంగా విరిసింది.**

●